క్లుప్తంగా

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

కాజులూరు: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుతో పాటు, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయని గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్నమానిక అన్నారు. త్వరలో గ్రామాల్లో జరగనున్న స్కూల్ గేమ్స్ ఆటల పోటీల్లో బాలుర విభాగానికి గురువారం గొల్లపాలెం హైస్కూల్‌లో ఎంపిక నిర్వహించారు. సర్పంచ్ ప్రసన్నమానిక, స్థానిక పీఏసీఎస్ చైర్మన్ అంగర కృష్ణ, ఎంపీడీఓ జె.రాంబాబు కబడ్డీ, వాలీ బాల్, లాంగ్‌జంప్ తదితర ఆటలను ప్రారంభించారు. మండల స్థాయిలో ఎంపికైన వారు నియోజకవర్గ, తర్వాత జిల్లా స్థాయి ఆటల్లో పోటీ పడతారని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ జాన్, హెచ్‌ఎం పి.సుశీలా మణి, పీడీ జి.సునీల్‌కుమార్, ఎస్‌పీసీ చైర్మన్ ఎం.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

దిగుమర్తి మృతికి సంతాపం

కపిలేశ్వరపురం: అంగర గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు, నాయీ బ్రాహ్మణ సంఘం మండల కమిటీ అధ్యక్షుడు దిగుమర్తి నెహ్రూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి మాజీ ఎంపీపీ మేడిశెట్టి సత్య వేణి, శాలివాహన సంఘం నాయకుడు పసల పూడి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు పాలింగి శ్రీనివాస్, వంగా నల్లశ్రీను గురువారం ఇక్కడ సంతాపం ప్రకటించారు.

తగ్గింపుతో ప్రజలకు మేలు

రామచంద్రపురం: ఔషధాల్లో జీఎస్టీ ఉండేదని దానిని జీరో చేయటం ద్వారా ప్రజలకు కొంత ఊరట కలిగిందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బీవీవీ సత్యనారాయణ అన్నారు. పట్టణంలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీ తగ్గించడం వలన ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజలు ఆరోగ్య సంరక్షణ పొందాలన్నారు. జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ వీరబాబు, డాక్టర్ డి.హేమసుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యం కావాలి

ఆలమూరు: దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు అవినీతి రహిత వికసిత్ భారత్ రూపకల్పన జరగాలని ఏపీ గ్రామీణ బ్యాంకు విజిలెన్స్ అధికారి ఈదర రాంబాబు అన్నారు. చొప్పెల్లలో ఉన్న గ్రామీణ బ్యాంకు ఆవరణలో గురువారం విజిలెన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి రాంబాబు మాట్లాడుతూ తమ బ్యాంకు రాష్ట్ర వ్యాప్తంగా మూడు నెలల పాటు అవినీతికి వ్యతిరేకంగా బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం దేశ ఆర్థిక, రాజకీయ సత్యనిష్ఠ ప్రతిజ్ఞ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు కార్యాలయం నుంచి కనకమహాలక్ష్మి ఆలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. హెచ్ఓడీ ఎం.లక్ష్మీ చైతన్య, మేనేజర్ కె.ఉదయ్ కుమార్‌దొర, బ్యాంకు శాఖ ప్రతినిధులు ఎం.సాగర్, ఆర్ సంతోష్ కుమార్, బి.కీర్తన, వడ్డీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కర అభివృద్ధి పనులపై సమీక్ష

ఆలమూరు: రాబోయే పుష్కరాలకు సంబంధించి తీసుకోవాల్సిన అభివృద్ధి పనులపై గురువారం దేవదాయ శాఖ అధికారుల బృందం మండలంలోని వివిధ దేవాలయాలను సందర్శించింది. దేవదాయ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారుల బృందం మండలంలోని ప్రధాన దేవాలయాలను సందర్శించి మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం గ్రామాల్లోని ఆలయాల వారీగా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై స్థానికుల సమక్షంలో సమీక్ష నిర్వహించారు. రామచంద్రపురం తనిఖీదారు ఆర్.బాలాజీ రాంప్రసాద్, ఏఈ ఫణి, ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి బాలాజీ స్వామి పవిత్రోత్సవాలు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి పవిత్రోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు గురువారం తెలిపారు. 15న విశ్వక్సేనారాధనతో ఉత్సవాలకు ప్రారంభమవుతాయని, ఆరోజు ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మూడు రోజుల పాటు ఈ పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 16న పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 17న శ్రీవారి శాంతి కల్యాణంతో ఉత్సవాలు సంపూర్ణమవుతాయని చెప్పారు.

బోధనేతర పనుల నుంచి తప్పించాలి

పి.గన్నవరం: ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని ఫ్యాప్టో నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల పదో తేదీ నుంచి బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాలను తాము బహిష్కరిస్తున్నట్టు ఫ్యాప్టో నాయకులు గురువారం పి.గన్నవరంలో ఎంఈఓలు చింతా వీరభద్రానందం, కోన హెలీనాకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు నల్లా బాలాజీ, రామకృష్ణ, నీతిపూడి శ్రీనివాస్, గిడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కెమిరాయ్

- సీసీ కెమెరాలతో నిఘా పటిష్టం
- భద్రత కోసం గ్రామాల్లో విస్తృత వినియోగం
- దుకాణాలు, ఇళ్ల వద్ద ఏర్పాటు
- ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమంటున్న పోలీసులు
- నేర పరిశోధనల్లో కీలక పాత్ర

కె.గంగవరం: కనిపించని నాలుగో సింహమే పోలీస్.. ఇది హిట్టయిన సినిమా డైలాగ్. నేర పరిశోధనల్లో ఆ పోలీసులకూ గొప్ప ఆయుధంగా మారింది ఏదో మూలన కనిపించీ.. కనిపించనట్టు నక్కి ఉండే సీసీ కెమెరా. సమాజంలో జరిగే హత్యలు, లైంగిక దాడులు, దోపిడీలు, దౌర్జన్యాల్లాంటివి ఎక్కడ జరిగినా.. వీటిని ఛేదించడానికి సీసీ కెమెరాలు పోలీసులకు మూడో కన్నుగా ఉపయోగపడుతున్నాయనడంలో సందేహం లేదు. పోలీసులు వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలే కాకుండా, ప్రైవేటు వ్యక్తులు తమ ప్రాంగణాల్లో, ఇళ్లలో, దుకాణాల్లో ఏర్పాటు చేసుకునే సీసీ కెమెరాలు సైతం పోలీసుల దర్యాప్తులో కీలక పాత్ర పోషిస్తున్నాయి. నేరాలు వేగంగా పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో.. వివిధ రూపాల్లో పోలీసులకు సహకరిస్తూ.. సీసీ కెమెరాలు సగం భారాన్ని తగ్గిస్తుయనే చెప్పాలి. గతంలో ఏదైనా నేరం జరిగితే దర్యాప్తు చేసేందుకు ఎంతో సమయం పట్టేది. పైగా ఆయా కేసుల్లో నిందితుడి ఆచూకీ తెలుసుకోవడమే పోలీసులకు పెద్ద ప్రహసనంలా మారేది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పుణ్యమా అంటూ నేర పరిశోధనల్లో పోలీసులు వేగంగా పురోగతి సాధిస్తున్నారు. నేరస్తుల కదలికలను సైతం ఇట్టే పసిగట్టేందుకు సీసీ కెమెరాలు నిఘా వర్గాలకు కీలకంగా మారుతున్నాయి.

నియోజకవర్గంలో..

రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్, పట్టణాల్లో గత ఏడాదిన్నర కాలంలో సీసీ కెమెరాల ఏర్పాట్లు ముమ్మరంగా జరిగాయి. కె.గంగవరం మండలంలోని 26 గ్రామాల్లో ఒక్కో గ్రామంలో ఆరు సీసీ కెమెరాల చొప్పున దాతల సహాయంతో స్థానిక పోలీసులు ఏర్పాటు చేశారు. దీంతో పాటు ప్రధాన కూడళ్లలో కూడా సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. కాజులూరు మండలంలోని ప్రధాన గ్రామాల్లో కూడా దుకాణాలు, పంచాయతీలు, పెద్ద భవనాలున్న యజమానులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సీసీ కెమెరాల వల్ల ఈ మధ్య గ్రామీణ ప్రాంతాల్లో దొంగతనాలు కూడా తగ్గాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అనుమానితులు గ్రామాల్లో సంచరిస్తే సీసీ కెమెరాల ద్వారా వారి పుటేజీని పోలీసులకు పంపి ముందే జాగ్రత్తపడుతున్నారు.

ఎలాంటివి వాడాలంటే..

పేరుకు ఏదో ఓ సీసీ కెమెరాను ఇళ్లకు, దుకాణాలకు అమర్చడంలో ప్రయోజనం ఉండదని పోలీసులు చెబుతున్నారు. బయటి వైపు ఉండే కెమెరాల్లో టీపో క్రిస్టల్ క్లియర్ 2కే క్యూహెచ్‌డీ పరిజ్ఞానం ఉన్న స్మార్ట్ హోమ్ సెక్యూరిటీ కెమెరాలు అమర్చుకోవాలని సూచిస్తున్నారు. ఈ కెమెరాల్లో నైట్ విజన్, మోషన్ డిటెక్షన్, టూవై ఆడియో స్టోరేజ్ ఆప్షన్, ఎలక్ట్రానిక్ పాస్ సౌకర్యాలుంటాయి. దీంతో నేరస్తులను సులభంగా గుర్తించవచ్చు. అలాగే లోపల వైపు పెట్టే కెమెరాల్లో పాస్ సెక్యూరిటీ వైఫై స్మార్ట్ పరిజ్ఞానం కానీ, 4జీ సిమ్ ఆధారంగా వైఫైతో పనిచేసే 3ఎంపీ స్మార్ట్ కెమెట్ హైబ్రిడ్ పరిజ్ఞానం కానీ ఉండాలి. దీంతో పాటు వాటర్ ప్రూఫ్ సౌకర్యం కూడా ఉండేటట్టు చూసుకోవాలి.



కె.గంగవరం సెంటర్‌లో పామర్రు కూడలి వద్ద సీసీ కెమెరాలు

నేర నియంత్రణలో కీలకం

సీసీ కెమెరాలు ఉండడం వల్ల అనుమానితులు, నేరస్తులను గుర్తించడంలో, ఆధారాలను సేకరించడంలో సీసీ కెమెరాలు ప్రధాన భూమికను పోషిస్తాయి. సీసీ కెమెరాల ద్వారా పొందిన ఆధారాలు న్యాయ ప్రక్రియలో కీలకంగా ఉంటాయి. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిని గుర్తించడలోను, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పర్యవేక్షించడంలో ఎంతో సహాయపడతాయి.



కాకినాడ- కోటిపల్లి ప్రధాన రహదారిలో ఉన్న సీసీ కెమెరాలు

పటిష్ట నిఘా



సీసీ కెమెరాలు భద్రతలో ఓ భాగమని గుర్తించి ప్రజలు సహకరించాలి. ఇప్పటికే కె.గంగవరం మండలంలోని పలు గ్రామాల్లో 120 వరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఇటీవల అద్దంపల్లిలో జరిగిన దారి దోపిడీ కేసును ఛేదించాం. పామర్రులో జరిగిన దోపిడీ కేసునూ ఛేదించి.. నిందితులను పట్టుకుని విచారణ చేస్తున్నాం. పటిష్ట భద్రత కోసం కొంత ఖర్చు చేసినా, దాని ప్రయోజనం ఎంతో ఉంటుందని ఇళ్లు, దుకాణాలు, పరిశ్రమల యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంకా పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

– జానీబాషా, ఎస్సై, కె.గంగవరం

గ్రామ సభల్లో ఉపాధి పనుల గుర్తింపు



పడమర ఖండ్రికలో ఉపాధి పనులను వివరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో గురువారం ఉపాధి పనులు గుర్తింపు కోసం గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని 19 గ్రామాల్లో పనులను గుర్తించేందుకు ఎంపీడీఓ హెచ్.భానూజీరావు పర్యవేక్షణలో రెండు మండల స్థాయి బృందాలు సభలను నిర్వహిస్తోంది. ఈ నెల 2న ప్రారంభమైన కార్యక్రమంలో భాగంగా గురువారం కపిలేశ్వరపురం, నేలటూరు గ్రామాల్లో పర్యటించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, పెద్దిరెడ్డి శేషారత్నం, ఉప సర్పంచ్ యర్రంశెట్టి వీరన్నబాబు అతిథులుగా హాజరయ్యారు. గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, రైతులతో చర్చించి ఉపాధి పనులను గుర్తించారు. ఉపాధి పనుల తీరుతెన్నులను ఫీల్డ్ అసిస్టెంట్లు వివరించారు. కార్యక్రమాన్ని ఉపాధి జేఈ వై.రవికుమార్, బృందం నాయకుడు పి.రజిత్‌సింగ్ పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ 11న వెదురుమూడి, తాతపూడి, 15న అచ్యుతాపురం, నిడసనమెట్ట, 18న నాగులచెరువు, వాకతిప్ప, 23న టేకి, నల్లూరు, 25న మాచర, వల్లూరు, 28న కోరుమిల్లి, కాలేరు, 31న వడ్లమూరు, 31న వడ్లమూరు, నవంబర్ 4న అద్దంకివారి లంక, కేదారిలంక గ్రామాల్లో ఉపాధి సభలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు నల్లచెరువు విద్యార్థిని ఎంపిక



అనంతలక్ష్మిని అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, ఫిజికల్ డైరెక్టర్

అయినవిల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని అడపా పావని సత్య అనంతలక్ష్మి ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాక్సింగ్ అండర్–17 కేటగిరీలో 70 నుంచి 75 కేజీల విభాగంలో పావని సత్య అనంతలక్ష్మి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూస్సీ నాగజ్యోతి తెలిపారు. రాజమహేంద్రవరంలో పదో తేదీ నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో అడపా పావనిసత్య అనంతలక్ష్మి పాల్గొంటుందన్నారు. ఆమెను అయినవిల్లి మండల విద్యాశాఖ అధికారి–1 ఎం.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి–2 పి.శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు అభినందించారు.

బకాయిలు చెల్లించాలంటూ మంత్రికి వినతి

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీగణపతి చేనేత పారిశ్రామికుల సహకార సంఘానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన వివిధ బకాయిలను వెంటనే చెల్లించాలంటూ చేనేత సంఘం నాయకులు ఉరవకొండ పర్యటనలో ఉన్న ఏపీ రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవితకు వినతిపత్రం అందజేశారు. అంగరలోని సహకార సంఘం ఎదుట గత 11 రోజులుగా నేత కార్మికులు బకాయిల విడుదల కోసం రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. వారికి మద్దతుగా శ్రీసత్యసాయి జిల్లా సోమందేవులపల్లి మండల చేనేత సంఘం నాయకులు ఉరవకొండ పర్యటనలో ఉన్న మంత్రిని కలిసి, అంగరతో పాటు, రాష్ట్రంలోని అన్ని చేనేత సంఘాలకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని వినతిపత్రాన్ని అందజేసినట్టు అంగర చేనేత కార్మికుల సంఘ నాయకులు గురువారం ఇక్కడ తెలిపారు. ఇలా ఉండగా అంగరలోని చేనేత సహకార సంఘం ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులకు పలు ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.



మంత్రికి సమస్యను వివరిస్తున్న చేనేత సంఘం నాయకులు

సంఘీభావ దీక్షకు నేతల మద్దతు

రామచంద్రపురం: కాకినాడ జిల్లాలో రామచంద్రపురం నియోజకవర్గాన్ని కలపాలని డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గురువారం సంఘీభావ దీక్షను చేపట్టారు. నియోజకవర్గ అఖిలపక్ష (జేఏసీ) గౌరవాధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్, మోడరన్ విద్యాసంస్థల అధినేత జీవీ రావు, రాష్ట్ర సర్పంచ్ సంఘాల గౌరవాధ్యక్షుడు పడాల రాము తదితరులు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ దీక్షలో రామచంద్రపురం నియోజకవర్గ అఖిలపక్ష కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో–కన్వీనర్ బత్తుల సిద్ధూ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉండవల్లి గోపాల్‌రావు, మాజీ అధ్యక్షులు దొమ్మల పాటి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గాధంశెట్టి శ్రీధర్, సీపీఐ పట్టణ నాయకులు పి.రాము, రామచంద్రపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి పసుపులేటి సత్తిబాబు తదితరులు మాట్లాడుతూ, రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని రెండు నెలలుగా భారీఎత్తున ప్రజలు పోరాటం చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, 2025 డిసెంబర్ 31 చివర కల్లా జనాభా లెక్కల్లో భాగంగా నియోజకవర్గాల విభజన, కొత్త జిల్లాల ఏర్పాటు పూర్తి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాల విభజన ప్రజాస్వామ్యబద్ధంగా చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వి.భీమశంకరం, చింతా రాజారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ మధు, దళిత సీనియర్ న్యాయవాది గాలింకి చిట్టిబాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు మందపల్లి చిట్టిబాబు, పీడీఎస్‌యూ నాయకులు కె.నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావ దీక్షకు మద్దతు తెలుపుతున్న నాయకులు

సంప్రదాయబద్ధంగా అట్లతద్దె



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలోని సప్త గోదావరి వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గ వ్యాప్తంగా అట్లతద్దె సందర్భంగా సందడి నెలకొంది. బుధవారం రాత్రి మహిళలు సంప్రదాయబద్ధంగా గోరింటాకు పెట్టుకున్నారు. గురువారం తెల్లవారుజామున సూర్యోదయానికి ముందే ఉపవాసం చేపట్టారు. సాయంత్రం ఉపవాసాలు ముగించారు. కొత్తగా పెళ్లయిన వారు ముత్తయిదువలకు వాయినాలు ఇచ్చారు. పసుపుతో చేసిన గౌరమ్మలను సమీపంలోని కాలువలు, నదుల్లో కలిపారు. సాయంత్రం చెట్లకు వేసిన ఉయ్యాలలు ఊగుతూ యువతులు, మహిళలు, చిన్నారులు సందడి చేశారు. ఆవును పూజించి, అట్లు తినిపించి పూజలు చేశారు. రాత్రి చందమామను దర్శించాక అట్లు భుజించి ఉపవాసాన్ని విరమించారు.

ఆలయాల సందర్శన

అట్లతద్దె సందర్భంగా రామచంద్రపురం పట్టణం, రామచంద్రపురం రూరల్, కె.గంగవరం, కాజులూరు మండలాల్లోని దేవాలయాలను మహిళలు సందర్శించారు. అమ్మవార్లను పూజించారు. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామలో 12వ శక్తి పీఠం మాణిక్యాంబ అమ్మవారిని పెద్దఎత్తున దర్శించుకున్నారు. సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ నియోజకవర్గంలో మహిళలు అట్లతద్దెను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

గ్రామాల్లో సందడి

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో గురువారం అట్లతద్దె సందడి నెలకొంది. మహిళలు భక్తిశ్రద్ధలతో నోము నోచుకుని ముత్తయిదవులకు వాయినాలను అందజేశారు. స్నానఘట్టాలు, గౌతమి గోదావరి పుష్కర ఘాట్ల వద్ద దీపారాధన చేశారు. అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి తదితర గ్రామాల్లోని నది, కాలువల వద్ద సందడి నెలకొంది.

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో అట్లతద్దె ఘనంగా నిర్వహించారు. పలువురు మహిళలు ఆలయాలకు వెళ్లి, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం నేత దడాల డిమాండ్

రాయవరం: కొమరిపాలెం శ్రీగణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్‌లో బుధవారం జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల వంతున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. దుర్ఘటన జరిగిన ప్రాంతాన్ని పార్టీ సభ్యులతో కలిసి గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ, ఈ ఘటన దురదృష్టకరమన్నారు. బాణసంచా తయారీ కేంద్రాలపై రెవెన్యూ, అగ్నిమాపక, పరిశ్రమలు, కార్మిక శాఖలు పర్యవేక్షణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి ఘటనా స్థలాన్ని పరిశీలించినప్పటికీ, ఎటువంటి నష్ట పరిహారం ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. తక్షణం మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల వంతున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, క్షతగాత్రుల కుటుంబాలకు రూ.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో పలుచోట్ల బాణసంచా తయారీ కేంద్రాలున్నట్లు సీపీఎం పర్యవేక్షణ కమిటీ గుర్తించిందని, బాణసంచా కేంద్రాలున్న ప్రదేశాలను సంబంధిత అధికారులు తక్షణం తనిఖీ చేసి, భద్రతా చర్యలపై సమీక్ష చేయాలన్నారు. ఆయన వెంట పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా సభ్యులు జి.దుర్గాప్రసాద్, ఎం.బలరామ్, జిల్లా సీనియర్ నాయకుడు కొవ్వూరి సత్తిరెడ్డి, సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ నాయకురాలు ఎస్.కృష్ణకుమారి, ఎం.కమల, మున్సిపల్ వర్కర్ల సంఘ జిల్లా కార్యదర్శి కె.నరేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

గర్భిణులకు వైద్య సేవలు

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా గురువారం పి.గన్నవరం సీహెచ్‌సీలో ఆస్పత్రి సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వారికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా వై.కొత్తపల్లికి చెందిన వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర జల వనరుల అభివృద్ధి కమిటీ చైర్మన్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, కోట రాజేంద్రప్రసాద్, నల్లా పెదకాపు, మేడిది సాయిబాబు, తోలేటి సారధి, కొర్లపాటి సూరిబాబు, తోలేటి సుబ్బారావు, ఆకాశం బాబీ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్ సీజ్

ఆలమూరు: జొన్నాడలో అనుమతులు లేకుండా కార్యకలాపాలను సాగిస్తున్న స్టోన్ క్రషర్‌ను అధికారులు సీజ్ చేశారు. స్థానిక గౌతమీ గోదావరి సమీపంలో అనధికారికంగా స్టోన్ క్రషర్‌ను నడుపుతుండడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందంటూ గ్రామస్తుల నుంచి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేరాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీఓ ఎ.రాజు నేతృత్వంలోని పంచాయతీరాజ్ సిబ్బంది నిర్వహించిన విచారణలో ఎటువంటి అనుమతి పత్రాలు లేవని తేలింది. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది పోలీసుల సహకారంతో ఆ స్టోన్ క్రషర్‌ను గురువారం సీజ్ చేశారు. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి చిక్కాల వీరమాత, సూపరింటెండెంట్ ఎంవీ మెహర్ ప్రకాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

మంత్రి సుభాష్

రామచంద్రపురం: రాయవరం శ్రీలక్ష్మి గణపతి బాణసంచా కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో మృతుల భౌతికకాయాలను మంత్రి గురువారం పరిశీలించారు. బాణసంచా పేలుడు ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరడంపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, పోలీస్ అధికారులను నిర్దేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, బాణసంచా కేంద్రం వద్ద శాంపిల్స్ సేకరించి విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారన్నారు. బాణసంచా తయారీ కేంద్రాల యజమానులు అన్ని జాగ్రత్తలు తీసుకునేలా విస్తృత తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు.



మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి

చెకుముకి ప్రతిభా పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ

రాజోలు: జన విజ్ఞాన వేదిక చెకుముకి ప్రతిభా పరీక్ష పోస్టర్‌ను మండల రిసోర్స్ సెంటర్ వద్ద యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ టీఎస్‌కేడీ ప్రసాదరావు గురువారం ఆవిష్కరించారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ నెల 18వ తేదీన పాఠశాల స్థాయి, నవంబర్ ఒకటో తేదీన మండల స్థాయి, నవంబర్ 23వ తేదీన జిల్లాస్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు రేఖపల్లి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి అడబాల కాశీ విశ్వేశ్వరరావు, జిల్లా కుటుంబ సంక్షేమ డైరెక్టర్ ఉండవల్లి శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షుడు కె.రాజబాబు, ప్రధాన కార్యదర్శి కె.వి.ఎస్.ఎస్.బాబు, కోశాధికారి కె.రామదుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అక్రమార్కులకు అడ్వాన్స్ దివాలీ

- పుట్టగొడుగుల్లా బాణసంచా అక్రమ విక్రయ దుకాణాలు
- బిల్లులు లేకుండా అధిక ధరలకు అమ్మకాలు
- లైసెన్స్‌లు లేకుండా చెలరేగిపోతున్న వైనం

కాట్రేనికోన: బాణసంచా సామగ్రి విక్రయించే అక్రమ వ్యాపారులకు రెండు వారాలకు ముందే దీపావళి పండగ వచ్చేసింది. బాణసంచా విక్రయించే వ్యాపారులు ఏ విధమైన ప్రభుత్వ అనుమతులు లేకుండా, బాణసంచా సామగ్రిని అక్రమంగా నిల్వలు చేస్తున్నారు. ప్రతి ఏటా దీపావళికి బాణసంచా అక్రమ విక్రయ కేంద్రాలు మండలంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్రభుత్వం నుంచి లైసెన్సు పొందిన షాపులతో పాటు, వాడవాడలా దీపావళి బాణసంచా సామగ్రి విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా, కుటీర పరిశ్రమలా అక్రమంగా బాణసంచా తయారు చేస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మామూళ్లకు అలవాటు పడిన కొందరు అధికారుల అండదండలతో, లైసెన్సులు పొందిన వ్యాపారులు అధిక ధరలకు అమ్మకాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. బాణసంచా విక్రయించే వ్యాపారులు ప్రభుత్వం నుంచి అనుమతులతో పాటు, విశాలమైన ప్రదేశాల్లోనే బాణసంచా విక్రయించాలి. అమ్మకాలు చేపడుతున్న ప్రాంతంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నీరు, ఇసుక, ఇతర అగ్ని నిరోధక సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలి. అగ్నిమాపక సిబ్బంది ఫోన్ నంబర్లను అక్కడ ప్రదర్శించాల్సి ఉంటుంది. దుకాణాల వద్ద వ్యాపారులు విక్రయ ధరల పట్టీ ఏర్పాటు చేయకపోవడంతో కొనుగోలుదారుల జేబులకు భారీగా చిల్లుపడుతోంది. వ్యాపారులతో సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు కొందరు తెరవెనుక కుదుర్చుకున్న ఒప్పందాల కారణంగా మిన్నుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. కాట్రేనికోనలో అక్రమ నిల్వలు ఉన్నాయనే సమాచారంతో పోలీసులు ఇటీవల జరిపిన దాడుల్లో భారీ ఎత్తున బాణసంచా సామగ్రి లభించాయి. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు అక్రమంగా నిల్వ ఉంచి, అమ్మకాలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు.

లైసెన్సుకు నిబంధనలు

బాణసంచా వ్యాపారులు లైసెన్స్ పొందేందుకు వారి గుర్తింపు పత్రం, అద్దె ఒప్పంద ప్రతం, అద్దెకిచ్చిన యజమాని నుంచి ఎన్‌ఓసీ ఉండాలి. ఏపీ ప్రభుత్వ సేవల పోర్టల్‌లో బాణసంచా లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. పోలీసు, పురపాలక సంఘం కమిషనర్, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులను సంప్రదించాలి. బాణసంచా నిల్వ, విక్రయానికి సంబంధించిన పత్రాలను వ్యాపారుల వద్ద అందుబాటులో ఉంచుకోవాలి.

ధరల బోర్డు ఏర్పాటు

దుకాణాల వద్ద కచ్చితంగా బాణసంచా విక్రయ ధరలతో ఉన్న బోర్డులు పెట్టి, కొనుగోలుదారులకు విక్రయ బిల్లులు ఇచ్చేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. బాణసంచా అక్రమంగా అమ్ముతున్న వ్యాపారులతో పాటు, ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇష్టారాజ్యంగా ప్రతి ఏటా అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. బాణసంచా తయారీ కేంద్రం నుంచి ప్యాకింగ్‌పై ఎమ్మార్పీ కంటే అధిక ధరలు ముద్రించి ఉండటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారు. వ్యాపారులు కొంత సరకుకు మాత్రమే బిల్లులు చెల్లించి, ఏ విధమైన జీఎస్టీ చెల్లించకుండా, అధిక మొత్తంలో దిగుమతులు చేసుకోవడం, కొనుగోలుదారులకు ఏవిధమైన బిల్లులు లేకుండా అమ్మకాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



వివిధ రకాల బాణసంచా (ఫైల్)